


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 119 | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# యూఎస్ చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను నిర్మించనున్న భారత ఎస్సార్ గ్రూప్

అమెరికా చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచిపోయే భారీ ఉక్కు కర్మాగారానికి అంకురార్పణ జరిగింది. భారతదేశానికి చెందిన ప్రముఖ ఎస్సార్ గ్రూప్ యాజమాన్యంలోని మెసాబి మెటాలిక్స్ కంపెనీ, అమెరికాలోని అయోవా రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.4 లక్షల కోట్లు) భారీ వ్యయంతో స్టీల్ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు.
- మిగతా2లో



# చైనాకు ఆయుధాల విక్రయం పై జిన్‌పింగ్‌తో చర్చించలేదన్న ట్రంప్

- అమెరికా ఆయుధాలు మెరుగ్గా ఉంటాయని వ్యాఖ్య
- రాయబారి వ్యాఖ్యల పై వివరాలు తెలుసుకుంటానని వెల్లడి
- జిన్‌పింగ్‌తో సమావేశానికి 12 రేటింగ్ ఇచ్చిన ట్రంప్
- రక్షణ అవసరాలకు చైనా పై ఆధారపడలేమని వ్యాఖ్య

2



# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్


2

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు

రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజక వర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..
- మిగతా2లో



# కేటీఆర్ వ్యాఖ్యల పై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్ లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. - మిగతా2లో

# కొచ్చిలో నారా లోకేశ్ కు ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు ప్రజలు


2

- సౌత్ ఇండియా సదస్సు కోసం కేరళలోని కొచ్చికి మంత్రి లోకేశ్
- ఏపీ ప్రగతి పథంపై సదస్సులో కీలక ప్రసంగం చేయనున్న లోకేశ్
- పాలన, విద్య, ఉపాధి అవకాశాల పై చర్చించనున్నట్లు వెల్లడి
- కొచ్చిలో తెలుగు ప్రజల నుంచి ఘనస్వాగతం లభించిందన్న మంత్రి

# బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్


2

ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ

టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం

ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న

# చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో - మిగతా2లో



VARTHA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 30 సెప్టెంబర్ 2026

# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

**గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు**

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది," అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

**సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం**

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కేటీఆర్ వ్యాఖ్యల పై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానిం చారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

# కొచ్చిలో నారా లోకేశ్ కు ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు ప్రజలు

ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభివృద్ధి, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ కేరళలోని కొచ్చి చేరుకున్నారు. కొచ్చి వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'ఇండియా టుడే సౌత్ ఇండియా సమ్మిట్'లో పాల్గొనేందుకు ఆయన అక్కడికి వచ్చారు. ఈ సదస్సులో ఆయన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రగతి ప్రస్థానంపై కీలక ప్రసంగం చేయనున్నారు. "ఆంధ్రప్రదేశ్ ప్రగతి ప్రస్థానం - పాలన, అభివృద్ధి, విద్య, ప్రపంచ స్థాయి లక్ష్యాలు" అనే అంశంపై మంత్రి లోకేశ్ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలన, ఆర్థికాభివృద్ధి, విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలను ఆయన వివరించనున్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను కూడా ఆయన ఈ వేదికపై ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. తన పర్యటనపై మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "కొచ్చిలో అడుగుపెట్టిన నాకు తెలుగు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్‌లో పాల్గొంటుండడం సంతోషంగా ఉంది. దక్షిణాదిలో అవకాశాలను తీర్చిదిద్దడంపై జరిగే ఈ చర్చలో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, కొచ్చిలో లోకేశ్ కు స్వాగతం పలికిన వారిలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ కూడా ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ, పారిశ్రామిక, విద్యా రంగ నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ విధానాలను, అభివృద్ధి నమూనాను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు ఇది ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుంది.

# చైనాకు ఆయుధాల విక్రయం పై జిన్‌పింగ్‌తో చర్చించలేదన్న ట్రంప్

చైనాకు అమెరికా సైనిక ఆయుధాలు విక్రయించే అంశంపై ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఎలాంటి చర్చలు జరపలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. చైనాకు ఆయుధాలు విక్రయించే ప్రతిపాదనను జిన్‌పింగ్ ముందు ఉంచారా? అని వైట్‌హౌస్‌లో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా స్పందించారు. అయితే, అమెరికా ఆయుధాలు మెరుగ్గా ఉంటాయని, చైనా వాటిని కొనుగోలు చేయాలనుకోవచ్చని ట్రంప్ వ్యాఖ్యానించారు. చైనాకు ఆయుధాలు విక్రయించే అంశంపై ట్రంప్ మాట్లాడినట్లు అమెరికా రాయబారి డేవిడ్ పెర్డ్యూ ఫాక్స్ న్యూస్ కార్యక్రమంలో చెప్పినట్లు ఓ విలేకరి ప్రస్తావించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. 'చైనాకా? మీరు తైవాన్ గురించి అడుగుతున్నారా?' అని ప్రశ్నించారు. చైనా గురించే రాయబారి మాట్లాడారని విలేకరి స్పష్టం చేయడంతో.. ఆ విషయం తనకు తెలియదని, రాయబారిని అడిగి తెలుసుకుంటానని ట్రంప్ చెప్పారు. బహుశా ఆయన తైవాన్ గురించి మాట్లాడి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఇటీవల చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరిగిన సమావేశం అద్భుతంగా సాగిందని ట్రంప్ పేర్కొన్నారు. సున్నా నుంచి పది వరకు రేటింగ్ ఇవ్వాల్సి వస్తే.. ఆ సమావేశానికి 12 ఇస్తానని వ్యాఖ్యానించారు. ఇరువురు నేతల మధ్య గౌరవప్రదమైన వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిపారు. అయితే, ఆ సమావేశంలో ఆయుధాల విక్రయాల ప్రస్తావన రాలేదని స్పష్టం చేశారు. అమెరికా రక్షణ అవసరాలకు కీలకమైన ఉక్కును దేశంలోనే ఉత్పత్తి చేసుకోవాల్సిన అవసరం ఉందని ట్రంప్ అన్నారు. యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకుల తయారీకి అవసరమైన ఉక్కు కోసం చైనాపై ఆధారపడలేమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయోవాలో ఉక్కు పరిశ్రమలో పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనను ప్రస్తావించారు. మరోవైపు, కెనడాతో వాణిజ్య సంబంధాలపై మాట్లాడిన ట్రంప్.. చైనాతోనూ అమెరికాకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి.

# యూఎస్ చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను నిర్మించనున్న భారత ఎస్సార్ గ్రూప్

అమెరికా చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచిపోయే భారీ ఉక్కు కర్మాగారానికి అంకురార్పణ జరిగింది. భారతదేశానికి చెందిన ప్రముఖ ఎస్సార్ గ్రూప్ యాజమాన్యంలోని మెసాబి మెటాలిక్స్ కంపెనీ, అమెరికాలోని అయోవా రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.4 లక్షల కోట్లు) భారీ వ్యయంతో స్టీల్ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌గా నిలవనుందని వైట్‌హౌస్ పేర్కొంది. వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ట్రంప్ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సమావేశంలో మెసాబి మెటాలిక్స్ ఛైర్మన్ రేవంత్ రుయా, ఎస్సార్ గ్రూప్ సహ వ్యవస్థాపకుడు రవి రుయాతో పాటు ఇతర కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, ఈ ప్లాంట్ అత్యంత అధునాతన టెక్నాలజీతో, నాణ్యమైన స్టీల్‌ను అందుబాటు ధరలలో ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. ముడిసరుకు సేకరణ నుంచి ఉక్కు ఉత్పత్తి వరకు పూర్తిగా అమెరికాలోనే జరిగేలా ఒక సమీకృత సరఫరా వ్యవస్థను ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తుందని వివరించారు.

**పూర్తిగా అమెరికన్ సప్లై చైన్**

ఈ భారీ స్టీల్ ప్లాంట్‌ను అయోవా రాష్ట్రంలోని లీ కౌంటీలో ఏర్పాటు చేయనున్నారు. దీనికి అవసరమైన ముడి ఇనుమును మిన్నెసోటాలోని నాష్‌వాక్‌లో కొత్తగా అభివృద్ధి చేసిన గని నుంచి సేకరిస్తారు. గత 50 ఏళ్లలో అమెరికాలో ఏర్పాటైన మొట్టమొదటి కొత్త ఇనుప ఖనిజం గని ఇదే కావడం విశేషం. మిన్నెసోటాలోని ఈ గని ప్రాజెక్టుపై ఎస్సార్ గ్రూప్ ఇప్పటికే 2.5 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టింది. గని, స్టీల్ ప్లాంట్‌లను కలిపి ఈ మొత్తం ప్రాజెక్ట్ విలువ సుమారు 18 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది.

**భారీగా ఉద్యోగాల కల్పన**

2030 నాటికి ఉక్కు ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్లాంట్, తొలి దశలో ఏటా 7.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. భవిష్యత్తులో దీనిని 10 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా అమెరికాలో భారీగా ఉద్యోగాల కల్పన జరగనుంది. నిర్మాణ దశలో సుమారు 6,000 మందికి, ప్లాంట్ కార్యకలాపాలు మొదలయ్యాక 1,750 మందికి శాశ్వత ఉత్పాదక ఉద్యోగాలు లభిస్తాయి. మిన్నెసోటాలోని గనిలో మరో 350 మందికి ఉపాధి దొరుకుతుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం, కార్యకలాపాల మొదటి దశాబ్దంలో అమెరికా ఆర్థిక వ్యవస్థపై సుమారు 95 బిలియన్ డాలర్ల సానుకూల ప్రభావం చూపుతుందని వైట్‌హౌస్ అంచనా వేసింది. ఈ విస్తరణ ప్రాజెక్టుకు అమెరికా ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ 10 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక సహాయం అందిస్తోంది. దిగుమతి చేసుకునే ఉక్కుపై తన ప్రభుత్వం విధించిన అధిక సుంకాల (టారిఫ్‌లు) వల్లే కంపెనీలు అమెరికాలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ముందుకొస్తున్నాయని ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ ప్లాంట్‌తో గని నుంచి ఉక్కు తయారీ వరకు '100 శాతం అమెరికన్' సరఫరా వ్యవస్థ పూర్తవుతుందని మెసాబి మెటాలిక్స్ పేర్కొంది.

# సంపాదకీయం

## సమాజంతో జగడమేసుకున్న బోయ జంగయ్య



తను రాసిన కథలు, కవిత్వం, నవలలు, బాలసాహిత్యం, మహనీయుల జీవిత చరిత్రలు, నాటకాల సృజనతో తెలుగు సాహిత్యానికి తెలంగాణ దళిత జీవితాన్ని జతపరిచి, విస్తరించిన సాహితీ స్రష్ట డాక్టర్ బోయ జంగయ్య. 1964లో బోయ జంగయ్య సాహితీ ప్రస్థానం మొదలైంది. వందకు పైగా కథలు రాశారాయన. పద్నాలుగు కథా సంపుటాలు, ఐదు కవితా సంపుటాలు, నాలుగు నాటికలు, మూడు నవలలు, ఆరు మహనీయుల జీవిత చరిత్రలు, తొమ్మిది బాల సాహిత్య పుస్తకాలను వెలువరించారు. తన రచనల ద్వారా అణగారిన సామాజిక వర్గాల్లో మూఢ నమ్మకాల నిర్మూలన, సామాజిక వివక్షలకు వ్యతిరేకమైన చైతన్యం, శాస్త్రీయ భావాలను పెంచడానికి బోయ జంగయ్య నిరంతరం కృషి చేశారు. సాహిత్యంలోనూ, జీవితంలోనూ అణగారిన వర్గాలు, ప్రధానంగా ఆ వర్గాల్లోని మహిళల పక్షపాతి బోయ జంగయ్య. పీడితుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి, తనలాగే స్వయంకృషితో తన పాత్రలనూ గెలుపు మార్గాలలో నడిపించిన రచయిత జంగయ్య. నిశితంగా పరిశీలిస్తే, వీరి సాహిత్యం తెలంగాణ సామాజిక చరిత్రగా, భారతీయ సంస్కృతిగా రూపుదిద్దుకోవడాన్ని చూడగలం. ఉమ్మడి నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండలం, పంతంగి బోయ జంగయ్య స్వగ్రామం. 1942 అక్టోబర్ 1న జంగయ్య జన్మించారు. ఎల్లమ్మ, మల్లయ్య ఆయన తల్లిదండ్రులు. జంగయ్య డిగ్రీ పూర్తి చేసి, ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం నిర్వహించారు. 1992లో ఆదివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో "అంబేద్కర్ నా పెంపుడు తండ్రి" అని డాక్టర్ బోయ జంగయ్య తన సామాజిక దృక్పథాన్ని ప్రకటించుకున్నారు. మహాకవి గుఱ్ఱం జాషువాతో కలిసి, తన పద్దెనిమిదో ఏటనే నల్లగొండ పురవీధుల్లో సంచరించారు. నిరంతరాయంగా సాహితీ సృజన చేస్తూనే, 'నల్లగొండ సాహితీ మిత్రులు' సంస్థకు అధ్యక్షులుగా, 'నల్లగొండ విజ్ఞాన సమితి'కి ప్రధాన కార్యదర్శిగా, 'నల్లగొండ జిల్లా రచయితల సంఘం' అధ్యక్షులుగా బోయ జంగయ్య నిర్మాణాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. కవి, రచయిత, ఐఏఎస్ అధికారి ఎ.విద్యాసాగర్, మరో ఐఏఎస్ అధికారిణి వాణీ ప్రసాద్, రచయిత, ఐఏఎస్ అధికారి ఫణికుమార్ వంటి వారు నల్లగొండలో పని చేసినప్పుడు వారు బోయ జంగయ్యతో కలిసి, సాహిత్యానికి ఎంతో సేవ చేశారు. ప్రముఖ రచయితలు రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు నల్లగొండకు వచ్చినపుడు జంగయ్య ఇంట్లోనే ఉండేవారు. అంతేకాదు, కాళోజీ, శ్రీశ్రీ, సినారె, జి.వి.సుబ్రహ్మణ్యం, ఆవంత్స సోమసుందరం, శివారెడ్డి, అంపశయ్య నవీన్, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, కొలకలూరి ఇనాక్, బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య మొదలైన ప్రముఖులతోనూ, దళిత కవులు, రచయితలు, మేధావుల ఐక్య వేదిక వారితోనూ, అరసం, విరసం సభ్యులతోనూ బోయ జంగయ్య సాహితీ చర్చలు నిర్వహించేవారు. అధికార, అనధికార సాహిత్య సభల్లో పాల్గొనడానికి దేశంలో విస్తృతంగా పర్యటించారు జంగయ్య. అఖిల భారత అభ్యుదయ రచయితల సదస్సులో; నేషనల్ బుక్ ట్రస్ట్, కేంద్ర సాహిత్య అకాడమీ వారి సాహిత్య కార్యక్రమాల్లో అతిథిగా అనేకసార్లు పాల్గొని, వివిధ సాహిత్యాంశాలపై జంగయ్య ప్రసంగించారు. బోయ జంగయ్య రాసిన 'జాతర' నవలను మైసూరు విశ్వవిద్యాలయంలో ఉపవాచకంగా, 'జగడం' నవలను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా, 'గొర్రెలు' కథా సంపుటిని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా, 'దున్న' కథా సంపుటిని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా పెట్టుకున్నారు. పరిశోధక విద్యార్థులు పదుల సంఖ్యలో బోయ జంగయ్య రచనలపై పీహెచ్‌డీలు చేశారు. తన జీవితకాలంలో పదికి పైగా సాహిత్య పురస్కారాలను అందుకున్న బోయ జంగయ్యను 2003లో తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సన్మానించింది. ప్రభుత్వ ట్రెజరీ శాఖలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, 2000 సంవత్సరం వరంగల్‌లో జంగయ్య ఉద్యోగ విరమణ చేశారు. అదే ఏడాది సెప్టెంబర్ 30న వరంగల్‌లో నిర్వహించిన ఉద్యోగ విరమణ సభలో కాళోజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2016 మే 7వ తేదీన తన 74వ ఏట బోయ జంగయ్య పరినిర్వాణం చెందారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బోయ జంగయ్య జయంతి, వర్ధంతులను ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలి. ఆయన పేరుతో సాహిత్య పురస్కారాన్ని నెలకొల్పాలి. ఏదైనా ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ సంస్థకు బోయ జంగయ్య పేరును పెట్టాలి. లోగడ ఆరుసార్లు ఆయనకు పద్మశ్రీ పురస్కారం కోసం ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇప్పుడు దాన్ని సాకారం చేయడానికి ప్రభుత్వం కృషి చెయ్యాలి. ఆయన సమగ్ర రచనలను ప్రభుత్వం ముద్రించి, అందుబాటులోకి తీసుకురావాలి. రవీంద్రభారతి ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి. ఈ ప్రతిపాదనలను పూర్తి చేయడం ద్వారా... అణగారిన ప్రజల సాధికారాన్ని కలలుగని, అందుకోసం కృషి చేసిన బోయ జంగయ్యకు తెలంగాణ సాహిత్య, సంస్కృతుల చరిత్రలో సగౌరవ స్థానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలి.

# నగర సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**- మేయర్ కొలగాని శ్రీనివాస్.**

సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం :

నగర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తమ పాలకవర్గం శ్రమిస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా మంగళవారం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు 19, 49వ డివిజన్లలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మొదటగా 49వ డివిజన్ విద్యానగర్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ తో కలిసి నగరపాలక సంస్థకు చెందిన రూ. 10 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులను భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ ను మేయర్ సందర్శించారు. హాస్టల్ సమీపంలోని పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. వాటిని పరిష్కారించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం 19వ డివిజన్ హరిహర నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ గౌడ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తో కలిసి నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగర ప్రజలు,





పాలకవర్గ సభ్యులు మా దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిగణలోకి తీసుకుని దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. నగరంలో యూఐడిఎఫ్ కు చెందిన 50 కోట్ల నిధులతో డివిజన్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు ప్రారంభం చేసి వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంబంధించిన నిధులతో అభివృద్ధి పనులను పూర్తి చేసి మరో 30 కోట్ల నిధులతో డివిజన్లలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో కరీంనగర్ నగరాన్ని అర్బన్ చాలేంజ్ ఫండ్ స్కీంలో చేర్చి 840 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 630 కోట్ల నిధులతో పలు ప్రాజెక్టులకు ప్రతిపానలు సిద్దం చేసి వాటికి ఆమోదం తెలిపామన్నారు. సంబంధిత ప్రాజెక్టుల పనుల టెండర్ ప్రక్రియ కూడ చేపట్టామని త్వరలోనే వాటికి సంబంధించిన పనులు ప్రారంభం చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రధానంగా ప్రజలకు సమస్యగా మారిన డంప్ యార్డును ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా చెత్తను తొలగిస్తున్నామని త్వరలోనే ప్రాసెసింగ్ పద్ధతిని కూడ చేపట్టి డంపుయార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. అంతే కాకుండా విలీన గ్రామాల డివిజన్లను ప్రాధాన్యతగా క్రమంగా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే పాలకవర్గ ధ్యేయం అన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు నగర రూపురేఖలు మార్చేందుకు శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలోగా, నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాసేలా అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఈ శ్రీనివాస్, స్థానిక ప్రజలు, మున్సిపల్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రక్తంతో సీఎంకు లేఖ రాసిన బీజేపీ నేత, కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్

**- ఎస్సీ కార్పొరేషన్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్.**

సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం:

దళితుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, బీజేపీ దళిత మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ సోమిడి వేణుప్రసాద్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు అందాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రోజున తన స్వంత రక్తంతో సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసి పంపారు. ఈ సందర్భంగా సోమిడి వేణు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రావాల్సిన సబ్సిడీ రుణాలు, అభివృద్ధి నిధులు ఆగిపోవడం వల్ల దళిత యువకులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని వేణుప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన అనేక హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి



అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, దళితుల హక్కులను కాలరాసేలా కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తోందని విమర్శించారు. దళితుల అభ్యున్నతి కోసం కేటాయించాల్సిన నిధుల పట్ల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యాన్ని సోమిడి వేణుప్రసాద్. తీవ్రంగా తప్పు పట్టారు.వెంటనే నిధులను విడుదల చేయాలని, లేనిచో దళితులను ఐక్యం చేసి ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్సీ మోర్చా అధ్యక్షులు బత్తుల లక్ష్మి నారాయణ, నాయకులు ఎడ్ల సురేష్, మెంగని రాజయ్య, గాలి సురేష్, కంపల్లి సుమన్, కుడిది నాగేందర్, సునీల్, నవీన్,పవన్ కళ్యాణ్ బండిపల్లి సంజీవ్, సతీష్, రాజు శేషిధర్, సాయిరాం, భానుచందర్, సంగం వేణు పెదపల్లి సాయి పాల్గొన్నారు.

# విద్యా బోధనలో నాణ్యతను పెంపొందించాలి







**-స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ రాములు సూచనలు**

సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం :

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు బోధనా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని మండల విద్యాధికారి రాములు సూచించారు. నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని ప్రభుత్వ మోడల్ హైస్కూల్‌లో మంగళవారం బయోసైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈఓ రాములు ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధన సాగించాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకుని బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు పరస్పరం తమ అనుభవాలను పంచుకుంటూ ఉత్తమ బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు వినూత్న బోధనా విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధనా విధానాలను రూపొందించి, ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలను అర్థం చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ మండల విద్యాధికారిగా ఎంపికైన ఎంఈఓ రాములు, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన జితిన్ బాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం ఝాన్సీ, పాఠశాల హెచ్‌ఎం శేషు, ఆర్పీలు హెమంత్‌రెడ్డి, అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాంపల్లిలో అర్హులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ

సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం

నల్గొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్వో ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్య క్రమం మంగళవారం నిర్వహించారు. మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నేతల కొండల యాదవ్, కాంగ్రెస్ నాయకుడు గాదెపాక నాగరాజు, స్థానిక సర్పంచులు ఎమ్మార్వోతో కలసి అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను స్వయంగా అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవారికీ అందేలా కృషి చేస్తున్నామని, ఈ క్రమంలోనే మండలంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశామని నాయకులు తెలి పారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో పలువురు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఉమ్మడి కర్నూలు జిల్లా వైస్సార్సీపీ పార్టీ ఇంచార్జిల సమావేశం విజయవంతం

**– బనగానపల్లె నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**

బనగానపల్లె, సెప్టెంబర్ 29, వార్త సాక్ష్యం

కర్నూలు జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయం నందు రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కర్నూలు జిల్లా నియోజకవర్గ వైఎస్సార్సీపీ పార్టీ ఇంచార్జీల సమావేశానికి హాజరు అయిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల మీద సమీక్షా సమావేశం,ఉమ్మడి కర్నూలు జిల్లా లో జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీ,నగర పంచాయతీ,జిల్లా పరిషత్,మండల పరిషత్, సర్పంచ్ ఎన్నికల్లో అన్ని చోట్ల పోటీ చేయాలి. వైఎస్సార్సీపీ పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థులకు నియోజకవర్గ ఇంచార్జీలు అండగా ఉండాలి. ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ చల్లా మధుసూదన్ రెడ్డి ,నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి ,మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ,నంద్యాల జిల్లా పార్టీ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ,కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్.వి. మోహన్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి ,మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ,ఎమ్మెల్సీ ఇసాక్ బాషా , ఎమ్మెల్సీ



మధుసూదన్ ,మాజీ మేయర్ బివై,రామయ్య ,బుట్టరేణుక , ఉమ్మడి కర్నూలు జిల్లాల మాజీ శాసన సభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి , శిల్పా చక్రపాణి రెడ్డి ,శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ,సాయి ప్రసాద్ రెడ్డి , కంగాటి శ్రీదేవి , విజయ మనోహరి ,హాఫీజ్ ఖాన్ , బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ,మణి గాంధీ , కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , దారా సుధీర్, అహ్మద్ అలీఖాన్ ,ముఖ్య వైసిపి నేతలు పాల్గొన్నారు.

# నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా,పి,బి,శీలమన్న ఎన్నిక





బనగానపల్లె, సెప్టెంబర్ 29 వార్త సాక్ష్యం

మండలంలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసి చైర్మన్‌గా పి బి శీలమన్న యాదవ్ ను, వైస్ చైర్మన్ గా శారదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మంగళవారం మండలంలోని నందవరం జడ్పీహెచ్ఎస్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించారు. ఎస్ఎంసి చైర్మన్‌గా రెండవసారి పి బి శీలమన్న యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా పి.బి. ప్రసన్న ఎన్నిక మండలంలోని నందవరం గ్రామంలోని మండల ప్రాథమిక పరిషత్ మెయిన్ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్‌గా పి.బి. ప్రసన్న యాదవ్, వైస్ చైర్మన్‌గా వై.మౌనికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఎంసి ఎన్నికలను నిర్వహించారు చైర్మన్ ,వైస్ చైర్మన్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# చెరుపల్లిలో స్వచ్ఛ రథాన్ని పరిశీలించిన ఎంపీడీవో

బనగానపల్లె , సెప్టెంబర్ 29, వార్త సాక్ష్యం

మండలంలోని చెరువుపల్లె గ్రామంలో ఎంపీడీవో నాగరాజు స్వచ్ఛ రథాన్ని పరిశీలించారు . మంగళవారం చెరువు పల్లె గ్రామంలో ఎంపీడీవో నాగరాజు డిప్యూటీ ఎంపీడీవో సురేంద్రనాథ్ యాదవ్ లు స్వేచ్ఛారథాన్ని పరిశీలించారు. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు ఇండ్లలో పనికిరాని వస్తువులను గ్రామానికి స్వేచ్ఛారథం వచ్చినప్పుడు ఇచ్చి ఇండ్లలోనికి ఉపయోగపడే సరుకులను,తీసుకోవాలన్నారుఇంటి వ్యర్థాలు ఇచ్చి నిత్యావసర సరుకులు తీసుకోవాలన్నారు.ప్రజలు తమ ఇండ్లలో పనికిరాని వస్తువులు ప్లాస్టిక్, పేపర్లు, గాజు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వంటివి గ్రామానికి స్వచ్ఛ రథం వచ్చినప్పుడు అప్పగించాలని , అలా ఇచ్చిన వ్యర్థాలకు బదులుగా ఇండ్లలో ఉపయోగపడే నిత్యావసర సరుకులను తీసుకోవచ్చని ఆయన తెలిపారు. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వచ్చి వ్యర్థాలను సేకరించి, వాటికి తూకం వేసి నిత్యావసర సరుకులు అందించడం జరుగుతుందని వివరించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ వినూత్న కార్యక్రమం ద్వారా గ్రామం శుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంటుందని ఆయన అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం



చేసుకోవాలని, స్వచ్ఛ రథాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి ప్రత్యేక కృషి

**– నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

నంద్యాల సెప్టెంబర్ 29 వార్త సాక్ష్యం

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం అన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజక వర్గం జూపాడు బంగ్లా మండలం తరిగోపుల గ్రామం, కొత్తపల్లి మండలం ఎం. లింగాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. తరిగోపుల గ్రామంలో రెండు సిమెంట్ రోడ్లు, రెండు రక్షణ గోడలు రూ. 20 లక్షలతో పూర్తి చేసిన పనులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. తరిగోపుల గ్రామానికి మినరల్ వాటర్ ఫ్లాంట్, అదనంగా సిమెంట్ రోడ్లు కూడా కొత్తగా మంజూరు చేస్తున్నట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. తరిగోపులలో మాజీ జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరావు, పి ఆర్ డి ఈ సుధాకర్ బాబు, ఏ ఈ బసిర్, ఎంపీడీఓ గోపినాథ్, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ వెంకటరమణ, పారుమంచాల కరుణాకర్‌రెడ్డి,శివచంద్రుడు,బాలస్వామి, నారాయణ , అలాగే కొత్తపల్లి మండలం ఎం.లింగాపురం గ్రామంలో ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ఫ్లాంట్ ను నంద్యాల ఎంపీ డాక్టర్





బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందుంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండల కేంద్రం కొత్తపల్లి గ్రామంలోని పురాతన తాండవ మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా నిధుల విడుదలకు కృషి చేస్తానని, దేవాదాయ శాఖ అధికారుల సహకారంతో తాండవ మల్లేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధారణ పనులకు అన్ని విధాలుగా సహకరిస్తానని గ్రామ పెద్దలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కొత్తపల్లి ఎంపీడీఓ మేరి, డిప్యూటీ తహసీల్దార్ అరుణ, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ జుబేర్, ఎం. లింగాపురం చిన్న. పుల్లారెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య



నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకట స్వామి, నరాల శ్రీనాథ్ రెడ్డి, శివారెడ్డి, రామచంద్రా రెడ్డి, మినరల్ వాటర్ కాంట్రాక్టర్ జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వంటావార్పుతో వినూత్న నిరసన



బనగానపల్లె, సెప్టెంబర్ 29 వార్త సాక్ష్యం

పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు వంటావార్పుతో వినూతన నిరసన చేశారు .మంగళవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం 13వ రోజుకు చేరుకుంది. 13వ రోజు వీఆర్ఏలు వంటావార్పుతో వినూతన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు గౌస్ పీరా మాట్లాడుతూ 13 రోజులుగా తమ ఆందోళన కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సమస్యల పరిష్కారంపై స్పష్టమైన స్పందన లేకపోవడం దారుణం అన్నారు. తెలంగాణ తరహాలో వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా వీఆర్ఏలుగా నియమించాలన్నారు. అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని, మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లో అర్హులైన వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం ఉపాధ్యక్షులు తలారి బాలుడు, నాయకులు తలారి సుబ్రహ్మణ్యం, తలారి బాలకృష్ణ, కే. హరిబాబు, తలారి ప్రసాద్, తలారి శ్రీనివాసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# బాలిక విద్యను ప్రోత్సహిద్దాం



బనగానపల్లె, సెప్టెంబర్ 29 వార్త సాక్ష్యం

బాలికల విద్యను ప్రోత్సహిద్దామని శ్రీ జే కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోవిందిన్నె ప్రాథమిక పాఠశాలలో శ్రీ జై కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె ఎస్ ఎస్ బ్రహ్మానందచారి ఆధ్వర్యంలో మనం ఫౌండేషన్ అధ్యక్షులు లాయర్ చక్రవర్తి సహకారంతో విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించాలని ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాయన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలో అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలిక విద్య వల్ల కలిగే లాభాలను వివరించారు. హెచ్ఎం కే మౌనిక మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలు వివరించారు. విద్య విశిష్టత వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కే. మౌనిక, ఉపాధ్యాయురాలు ప్రియాంక, ఏఎన్ఎం పద్మావతి, బీసీ సంఘం నాయకుడు హరికృష్ణ గౌడ్, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నీట్ పీజీలో ర్యాంకు సాధించిన సాయి అనిలను అభినందించిన బీసీ ఇందిరా

బనగానపల్లె సెప్టెంబర్ 29 వార్త సాక్ష్యం



పట్టణంలోని పెండేకంటి నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నేట్ల రామమోహన్ రెడ్డి కుమార్తె సాయి అనిల జాతీయ స్థాయి నీట్ (పీజీ) పరీక్షలో ర్యాంకు సాధించడంతో టిడిపి నియోజకవర్గ నాయకురాలు బిసి ఇందిరా రెడ్డి అభినందించి సన్మానించారు. మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీసీ ఇందిరా రెడ్డి సాయి అనిలను, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. సాయి అనిలను శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. సాయి అనిల పీజీ నీటిలో 720 మార్కులకు గాను 560 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 1537వ ర్యాంక్‌తో పాటు నంద్యాల జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవలందించాలని ఆమె ఆకాంక్షించారు.స్వగ్రామమైన నందవరంలో భవిష్యత్తులో ప్రతి నెలా ఒక రోజు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాలని సాయి అనిలకు బీసీ ఇందిరా రెడ్డి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని, అందుకు తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 30 సెప్టెంబర్ 2026

# శ్రీశైల నందీశ్వరస్వామికి విశేషపూజ

శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం

శ్రీశైలంలో లోక కల్యాణం కోసం దేవస్థానం ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది.ప్రదోషకాలంలో అనగా సాయం సంధ్యా సమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధ జలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించ బడుతుంది.



## సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందంజలో రామ్‌దేవ్‌రావు హాస్పిటల్

సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం సేవలు పొందిన 406 మంది, ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యాన్ని తెలియజేయడం ఈ కార్యక్రమాల లక్ష్యమని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ కార్యక్రమంలో భాగంగా, కుముదినీదేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ సనాతన సహకారంతో వాకథాన్ నిర్వహించారు. ప్రముఖ రేకీ థెరపీ గ్రాండ్ మాస్టర్, రచయిత్రి, ఫ్యామిలీ కౌన్సిలర్ మరియు సామాజిక కార్యకర్త శ్రీమతి లక్ష్మీ కమలాకర్ పచ్చజెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. నిత్యం వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా హృదయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. వాకథాన్‌లో గైనకాలజిస్టులు డా. చాయాదేవి, డా. ప్రమోదిని, డా. మంజుల, డా. సుమన్ లత; కార్డియాలజిస్టులు డా. ప్రదీప్ రెడ్డి, డా. శ్రీకాంత్; రేడియాలజిస్టులు డా. లోకేష్ రెడ్డి, డా. మౌనిక; ఈఆర్ ఫిజీషియన్లు డా. స్వాతి రెడ్డి, డా. సుమ, డా. వీరభద్ర; పాథాలజిస్టులు డా. పావని, డా. చందన పాల్గొన్నారు. వీరితో పాటు డా. సుధారాణి (అనస్థీషియా), డా. డి. నాగేంద్ర (పల్మనాలజిస్ట్), డా. రోహిత్ నాయక్ (న్యూరో సర్జన్), డ్యూటీ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు మరియు ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. వాకథాన్ అనంతరం వైద్యులు గుండె జబ్బుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరంలో బీపీ, జీఆర్‌బీఎస్ (రక్తంలో చక్కెర), ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలతో పాటు కార్డియాలజీ వైద్యుల సంప్రదింపులను అందించారు. శిబిరానికి విశేష స్పందన లభించగా, మొత్తం 406 మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకత్వంలో, డా. కమలాకర్, డా. ప్రదీప్ రెడ్డి, డా. యోబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయ వంతంగా జరిగాయి. సహకరించిన వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పాల్గొన్న ప్రజలందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. "ప్రజల ఆరోగ్యం -- మా బాధ్యత" అనే స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటామని, భవిష్యత్తులోనూ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరియు ఉచిత వైద్య శిబిరాలను కొనసాగిస్తామని హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది.



## వృద్ధాశ్రమ నిర్వాహకులు, పర్యవేక్షకుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమం

– ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి DLSA కార్యదర్శి జు. శ్రీదేవి

సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం :

హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమాల నిర్వాహకులు మరియు పర్యవేక్షకుల కోసం ఒక న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. వృద్ధుల హక్కులు, సంక్షేమ చట్టాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు ఆశ్రమ నిర్వహణ అంశాలపై ఇందులో ప్రధానంగా చర్చించారు. హైదరాబాద్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో, హైదరాబాద్ వృద్ధాశ్రమాల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (సెషన్స్ డివిజన్, నాంపల్లి, హైదరాబాద్) కార్యదర్శి జు. శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ, వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం, భద్రత, వైద్య సదుపాయాలు, పౌష్టికాహారం, వసతి మరియు అవసరమైన న్యాయ సహాయం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నొక్కి చెప్పారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, వేధింపులు లేదా వారి హక్కుల ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో అందుబాటులో ఉన్న న్యాయపరమైన పరిష్కారాలు మరియు ఉచిత న్యాయ సేవల గురించి సమాచారం అందించబడింది. వృద్ధాశ్రమాలలో వృద్ధుల హక్కుల పరిరక్షణ, భద్రత, పరిశుభ్రత, వైద్య సదుపాయాలు, రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారం, ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై అవగాహన కల్పించారు. వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ పథకాలు, మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయడంపై, అలాగే ఆశ్రమ సిబ్బంది, పర్యవే క్షకులు వృద్ధుల పట్ల గౌరవంతో, మానవీయ దృక్పథంతో వ్యవహరించాల్సిన ఆవశ్యకతపై ప్రత్యేక దృష్టి సారించారు. అవసరమై నప్పుడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలియ జేశారు. వృద్ధులకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని మరియు వారికి తగిన సహాయం అందేలా చూడాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, వృద్ధాశ్రమ నిర్వాహకులు మరియు పర్యవేక్షకులు, DRO కమిటీ సభ్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు.





## భువనగిరి పిఎసిఎస్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం

పిఎసిఎస్ భువనగిరి వారి ఆధ్వ ర్యంలో సర్వసభ్య సమావేశం ఎస్ వి ఎస్ ఫంక్షన్ హాల్ అనాజి పురం నందు జరిగినది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ సభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పక్కిరు కొండల్ రెడ్డి సంఘసభ్య లు,రైతులు మరియు అధికారు లు సంఘ పురోగాబివృద్ధి ఎంత గానో తోడ్పడుతున్నారనిఎప్పటి కీ ఇలాగే ఉండాలని సభ్యులకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్,మున్సిపల్ వైస్ చైర్మన్, బీబీనగర్ పిఎసిఎస్ చైర్మన్,చందుపట్ల పిఎసిఎస్ చైర్మన్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య, పిఎసిఎస్ భువనగిరి డైరెక్టర్లు, భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్లు మండలం సర్పంచులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## మహిళ ఆత్మహత్య

వార్త సాక్ష్యం సెప్టెంబర్ 29- వెలుగోడు



వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామంలో ఓ మహిళ క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. చిన్నచిన్న మనస్పర్థల కారణంగా ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని వెలుగోడు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వేల్పనూరు గ్రామానికి చెందిన బండారి కళ్యాణి (28) సోమవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఇంట్లో ఉన్న సమయంలో చిన్నచిన్న మనస్పర్థలతో క్షణికావేశానికి లోనైనట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి పడకగదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆమెను కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సురేష్ వెల్లడించారు.ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు, ఇతర అంశాలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే చర్యలు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. పోలీసులు అన్ని కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు.

## హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడం బాధాకరం

-హరిహరులను విభజించే హక్కు ఎవరిచ్చారు?

- అత్తాపురం మహేందర్ రెడ్డి



సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం:

కొత్తూరు:హిందూ సమాజం అత్యంత పవిత్రంగా ఆరాధించే శ్రీరాముడు, పరమశివుడిని రాజకీయ ప్రయోజనాల కోసం పేదలు--ధనికులు, ఉత్తరాది--దక్షిణాది అంటూ విభజించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం బాధా కరమని బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి అన్నారు. హరిహరులు ఒక్కటేనని,భక్తికి ప్రాంతం, కులం,ఆర్థిక స్థాయి వంటి భేదాలు లేవని పేర్కొన్నారు. తెలంగాణలో వేములవాడ రాజరా జేశ్వర స్వామి క్షేత్రం దక్షిణ కాశీగా,భద్రాచలం దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందాయని గుర్తుచేశారు. దేవుళ్లను రాజకీ యాల్లోకి లాగి భక్తుల విశ్వా సాలను విభజించే ప్రయత్నం చేయడం సరికాదని అన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన నాయకులు,కోట్లాది మంది ఆరాధించే దేవతల విషయంలో విభజనకు దారితీసే వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. శ్రీరాముడు, పరమశివుడు కోట్లాది హిందువుల ఆరాధ్య దైవాలని, వారి మధ్య విభజన సృష్టించేలా వ్యాఖ్యలు చేయడం హిందూ సమాజం మనో భావాలను దెబ్బతీసే విధంగా ఉందని మహేందర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రాజకీయ ప్రయోజనాల కోసం హరిహరులను కూడా విడదీయాలనుకోవడం ఏ సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



సెప్టెంబర్ 29 వార్తా సాక్ష్యం

నువ్వుల బండ జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం,ప్రభుత్వ చౌకధరల దుకాణం డీలర్ సాయి రెడ్డి, క్రమ సంఖ్య 3302242 రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం, వచ్చేనెల 10వ తారీకు వరకు కొనసాగుతోంది.వారు తెలుపుతూ.నువ్వులబండ రేషన్ షాప్ నంబర్ పరిధిలో రేషన్ పొందుతున్న లబ్ధిదారులకు మాత్రమే ఇక్కడ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నట్లు నువ్వులబండ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు అవసరమైన గుర్తింపు ప్రూఫ్‌ను వెంట తీసుకెళ్లి, తమ స్మార్ట్ రేషన్ కార్డులను పొందాలని వారు సూచించారు. సంబంధిత లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## పండగ ముందు పప్పుల షాక్ సామాన్యుడిపై మరో భారం.. కారణాలేంటి?



దేశవ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొన్న వేళ సామాన్య ప్రజలకు పప్పుల ధరలు షాకిస్తున్నాయి. దీపావళి సమీపిస్తుండటంతో, కీలకమైన పప్పుధాన్యాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ముఖ్యంగా శనగ, కంది, పెసర, బఠాణీ వంటి నిత్యావసర పప్పుల ధరలు గత కొన్ని వారాల్లోనే చుక్కలనంటాయి. ఇండియన్ పల్సెస్ అండ్ గ్రెయిన్స్ అసోసియేషన్ (ఐపీజీఏ) గణాంకాల ప్రకారం కొన్ని రకాల పప్పుల హోల్‌సేల్ ధరలు గత నెల రోజుల్లోనే 11 శాతం వరకు పెరిగాయి.

**-భారీగా పెరిగిన కంది, శనగ ధరలు**

భారత్‌లో అత్యధికంగా వినియోగించే శనగపప్పు ధర నెల రోజుల్లో 11 శాతం, వారం రోజుల్లో 5.5 శాతం పెరిగింది. ఇక పెసరపప్పు 10.6 శాతం, కందిపప్పు 6.5 శాతం, బఠాణీ 6 శాతం మేర పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే శనగపప్పు ధర 23 శాతం, బఠాణీ 47 శాతం, మిన ప్పప్పు 24 శాతం అధికంగా ఉన్నాయి. సోమవారం నాటి రిటైల్ మార్కెట్ సగటు ధరలను పరిశీలిస్తే.. కిలో శనగపప్పు రూ. 88.72, కందిపప్పు రూ. 125.72, పెసరపప్పు రూ. 112.14, మసూర్ పప్పు రూ. 90.43గా నమోదయ్యాయి.

**-పెరుగుదలకు కారణాలేంటి?**

పండగ సీజన్ కావడంతో ఇళ్లలో నిత్యావసర సరుకుల నిల్వలు పెంచుకోవడం ధరల పెరుగుదలకు తక్షణ కారణంగా కనిపిస్తున్నప్పటికీ, దీని వెనుక బలమైన సరఫరా ఆందోళనలు ఉన్నాయని వ్యాపారులు, పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా పప్పుధాన్యాలను అధికంగా పండించే మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు, నేలలో తేమ తగ్గడం వంటి కారణాలతో ఖరీఫ్ పంట దిగుబడిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రత్యేకంగా కందిపప్పు ఉత్పత్తిపై ప్రభావం చూపనుంది.

## సిమెంట్ ధరలు మళ్లీ పెరిగే ఛాన్స్- అక్టోబర్‌లో బస్తాపై రూ.20 వరకు పెంపు?



సిమెంట్ ధరలు మరోసారి పెరగనున్నాయి. సెప్టెంబర్ లో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ధర రూ.7 పెరగ్గా.. అక్టోబర్‌లో మరో రూ.5 నుంచి రూ.20 వరకు పెంచే అవకాశం ఉందని సెంట్రమ్ బ్రోకింగ్ నివేదిక తెలిపింది. అయితే పెంచిన ధరలను కంపెనీలు ఎంతకాలం కొనసాగించగలవన్నది డిమాండ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా సిమెంట్ బస్తా సగటు ట్రేడ్ ధర రూ.356కు చేరింది. జులై, ఆగస్టులో ధరలు దాదాపు స్థిరంగా ఉండగా.. సెప్టెంబర్‌లో మాత్రం ధరల పెరుగుదల కనిపిం చింది. ట్రేడ్ సెగ్మెంట్‌తో పాటు నాన్-ట్రేడ్ విభాగం లోనూ ధరలు పెరిగాయని సెంట్రమ్ తెలిపింది. అయితే కొన్ని ప్రాంతాల్లో కంపెనీలు పెంచిన ధరల భారాన్ని డీలర్లు పూర్తిగా వినియోగ దారులపై మోపలేదు. ఇదిలా ఉంటే పెరిగిన ఇంధన ఖర్చులు సిమెంట్ కంపెనీలపై ఒత్తిడి పెంచుతు న్నాయి. దీంతో అధిక ధరలను అమలు చేసి కొనసాగించడం కంపెనీలకు మరింత కీలకంగా మారొచ్చని నివేదిక పేర్కొంది. రెండో త్రైమాసికంలో సిమెంట్ డిమాండ్ సాధారణ స్థాయి కంటే బలహీనంగా ఉన్నప్పటికీ.. సీజనల్ మందగమనంతో పోలిస్తే తగ్గుదల తక్కువగానే ఉందని తెలిపింది. త్రైమాసికం చివర్లో కొన్ని మార్కెట్లలో నిర్మాణ కార్యకలాపాలు పుంజు కోవడంతో అక్టోబర్‌లో మరోసారి ధరలు పెంచేం దుకు కంపెనీలకు అవకాశం ఏర్పడిందని పేర్కొంది. ప్రాంతాల వారీగా చూస్తే సెప్టెంబర్‌లో దక్షిణ భారతదేశంలో సిమెంట్ ధరలు అత్యధికంగా రూ.11 పెరిగాయి. పశ్చిమ భారతంలో రూ.9, మధ్య, తూర్పు, ఉత్తర భారతంలో ఒక్కో బస్తాపై రూ.5 చొప్పున ధరలు పెరిగాయి. అయితే ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నిర్మాణ కార్యకలాపాలపై రాబోయే ఆంక్షలు సిమెంట్ డిమాండ్‌పై ప్రభావం చూపొచ్చని నివేదిక తెలిపింది. డిమాండ్ పుంజుకోకపోతే అక్టోబర్‌లో పెంచిన ధరలను కొనసాగించడం కంపెనీలకు సవాలుగా మారొచ్చని పేర్కొంది.

## టాటా ఈవీ కార్లపై కళ్లు చెదిరే తగ్గింపు- కొత్త ఫైనాన్సింగ్ విధానం ఇదే!



దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) కొనుగోలును మరింత సులభతరం చేసే దిశగా ఒక కీలక ముందడుగు వేసింది. తన వినూత్నమైన 'బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్' (BaaS) పథకాన్ని ఇప్పుడు అన్ని ఈవీ మోడళ్లకు విస్తరించింది. ఇప్పటివరకు కేవలం టియాగో, పంచ్ ఈవీలకు మాత్రమే పరిమితమైన ఈ సౌకర్యం, ఇకపై అత్యంత ప్రజాదరణ పొందిన నెక్సాన్ ఈవీతో పాటు, భవిష్యత్తులో రానున్న కర్వ్ ఈవీ, సియెర్రా ఈవీ, హారియర్ ఈవీ మోడళ్లకు కూడా అందుబాటులో ఉంటుంది. ఈ నిర్ణయంతో టాటా ఈవీ కార్ల ప్రారంభ కొనుగోలు ధరలు గణనీయంగా తగ్గనున్నాయి.

**-ఏమిటీ 'బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్' (BaaS) పథకం?**

సాధారణంగా ఎలక్ట్రిక్ వాహనం ధరలో దాదాపు 40% నుంచి 50% వరకు బ్యాటరీకే ఉంటుంది. దీనివల్ల ఈవీల ధరలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు టాటా మోటార్స్ ఈ ధీఘ్గూ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో వినియోగదారులు వాహనాన్ని కొనుగోలు చేసేటప్పుడు బ్యాటరీకి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం కారు బాడీకి (షెల్) మాత్రమే డబ్బు చెల్లించి, వాహనాన్ని సొంతం చేసుకోవచ్చు. బ్యాటరీని కంపెనీ నుంచి నెలవారీ రుసుము లేదా లీజు పద్ధతిలో వాడుకోవచ్చు. దీని కోసం వాహ నానికి, బ్యాటరీకి వేర్వేరుగా రుణాలు అందిస్తారు. దీంతో కారు కొనేటప్పుడు పెట్టాల్సిన ప్రారంభ పెట్టుబడి భారీగా తగ్గుతుంది. అయితే, బ్యాటరీతో కలిపి వాహనాన్ని కొనుగోలు చేసే పాత విధానం కూడా యథావిధిగా అందుబాటులో ఉంటుంది.

**-భారీగా తగ్గిన ప్రారంభ ధరలు**

ఈ (BaaS) పథకం కింద వాహనాల ప్రారంభ ధరలు (పన్నులు, ఇతర ఛార్జీలు మినహాయించి) ఆకర్షణీ యంగా ఉన్నాయి. టియాగో ఈవీ: రూ. 4.69 లక్షలు (ఆదా రూ.2.30 లక్షలు), పంచ్ ఈవీ: రూ. 6.59 లక్షలు (ఆదా రూ.3.20 లక్షలు), నెక్సాన్ ఈవీ: రూ. 8.99 లక్షలు (ఆదా రూ.5.35 లక్షలు), కర్వ్ ఈవీ: రూ. 10.99 లక్షలు (ఆదా రూ.6.20 లక్షలు), సియెర్రా ఈవీ: రూ. 11.99 లక్షలు (ఆదా రూ.6.80 లక్షలు), హారియర్ ఈవీ: రూ. 14.49 లక్షలు (ఆదా రూ.7.30 లక్షలు)

## ఆసియా క్రీడల్లో నీరూ ధండా చారిత్రక స్వర్ణం- అభినందించిన ప్రధాని మోదీ



జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత షూటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరూ ధండా చారిత్రక స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల చరిత్రలో ఈ విభాగంలో వ్యక్తిగత స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె రికార్డు సృష్టించింది. ఇదే ఈవెంట్‌లో మహిళల జట్టు రజత పతకాన్ని గెలుచుకుని భారత్ ఖాతాలో మరో పతకాన్ని చేర్చింది. ఈ చారిత్రక విజయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందిస్తూ ఎక్స్ లో పోస్టులు పెట్టారు. "నీరూ ధండా భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించింది. ఆసియా క్రీడల ట్రాప్ ఈవెంట్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళగా నిలిచిన ఆమెకు అభినందనలు. ఆమె అద్భుతమైన కచ్చితత్వం, నిలకడ దేశానికి గర్వకారణం. ఈ విజయం ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. అలాగే, టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన మనీషా, నీరూ, ఆషిమాలను కూడా ప్రధాని అభినందిస్తూ, వారి టీమ్‌వర్క్‌ను ప్రశంసించారు. మంగళవారం జరిగిన ఫైనల్‌లో నీరూ ధండా అత్యంత నిలకడైన ప్రదర్శన కనబరిచింది. మొత్తం 28 హిట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. చైనాకు చెందిన సన్ యునోంగ్ (26 హిట్లు) రజతం గెలుచుకోగా, కువైట్‌కు చెందిన హజర్ అబ్దుల్‌మాలిక్ (21 హిట్లు) కాంస్యంతో సరిపెట్టుకుంది. అంతకు ముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లోనూ 118 పాయింట్లతో నీరూ అగ్రస్థానంలో నిలవడం విశేషం. మరోవైపు, మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో నీరూ ధండా, ఆషిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కూడిన భారత బృందం రజత పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈ ముగ్గురూ సంయుక్తంగా 328 స్కోరు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో చైనా (346) స్వర్ణం గెలుచుకోగా, కువైట్ (325) కాంస్య పతకం దక్కించుకుంది. అయితే, ఆషిమా, మనీషా వ్యక్తిగత ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు.

## కోహ్లీకి హ్యాట్సాఫ్- అతని ఆత్మవిశ్వాసమే వేరు: కపిల్ దేవ్



టీమిండియా పరుగుల యంత్రం విరాట్ కోహ్లీపై భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసల వర్షం కురిపించాడు. వన్డే ఫార్మాట్‌లో కోహ్లీ అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసిన చారిత్రక ఘనతపై కపిల్ స్పందించాడు. కోహ్లీ నిలకడ, అంకితభావం అద్భుతమని కొనియాడాడు. ఏఎన్ఐ (ANI) వార్తా సంస్థతో మాట్లాడుతూ, "విరాట్‌కు హ్యాట్సాఫ్. ప్రపంచంలో 60కి పైగా బ్యాటింగ్ సగటు ఉన్న ఆటగాళ్లు చాలా తక్కువ మంది ఉంటారు" అని కపిల్ అన్నాడు. కోహ్లీ అపారమైన నైపుణ్యం కలవాడని, ముఖ్యంగా అతని ఆత్మవి శ్వా సం, తనను తాను నమ్మే తత్వం అతడిని ప్రత్యే కంగా నిలుపుతాయని వివరించాడు. వెస్టిండీస్‌తో జరి గిన ఓ వన్డే మ్యాచ్‌లో కేవలం 88 బంతుల్లో అజే యంగా 139 పరుగులు చేసిన సందర్భంగా కోహ్లీ ఈ మైలు రాయిని అందుకున్నాడు. ఈ ఘనతతో, వన్డేల్లో 15,000 పరుగుల మార్కును చేరిన రెండో భారత ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ సరసన నిలిచాడు. కాగా, 2023 ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో సచిన్ రికార్డును అధిగమించి 50వ వన్డే సెంచరీని నమోదు చేయడం కూడా కోహ్లీ కెరీర్‌లో మరో మరపురాని ఘట్టం. కపిల్ దేవ్ వంటి దిగ్గజం నుంచి వచ్చిన ఈ ప్రశంసలు కోహ్లీ స్థాయిని మరింతగా చాటుతున్నాయి.

# స్పోర్ట్స్

## గణాంకాల కోసం ఆడితే ఎక్కువ కాలం కొనసాగలేం: కోహ్లీ



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్‌లో మరో చారిత్రాత్మక మైలురాయిని అందుకోవడం తెలిసిందే. వన్డే ఫార్మాట్‌లో 15,000 పరుగులు పూర్తి చేసుకున్న రెండో ఆటగాడిగా, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సరసన నిలిచాడు. అయితే, తన సుదీర్ఘ కెరీర్‌కు, నిలకడైన ప్రదర్శనకు కారణం రికార్డులు కాదని, జట్టును గెలిపించాలనే తపన మాత్రమేనని కోహ్లీ స్పష్టం చేశాడు. తాజాగా బీసీసీఐ.టీవీతో మాట్లాడిన కోహ్లీ తన విజయ రహస్యాన్ని పంచుకున్నాడు. "సంఖ్యల పరంగా చూస్తే ఇది చాలా పెద్ద మైలురాయి. కానీ, నా లక్ష్యం చాలా స్పష్టమైనది. కష్టమైన పరిస్థితుల్లో, విభిన్న సవాళ్లను ఎదుర్కొని జట్టును గెలిపించేందుకే నా ప్రయత్నం. ఇన్నేళ్లుగా నేను అదే చేస్తున్నాను" అని వివరించాడు. కేవలం గణాంకాల కోసం ఆడితే ఏ ఆటగాడూ ఎక్కువ కాలం కెరీర్‌లో కొనసాగలేడని 37 ఏళ్ల కోహ్లీ అభిప్రాయపడ్డాడు. "మీరు జట్టును గెలిపించాలని చూస్తేనే ఇంతకాలం ఆడగలరు. కేవలం గణాంకాల కోసమే అయితే ఎక్కువ కాలం ఆడలేరు. ఎందుకంటే, గణాంకాలపై దృష్టి పెడితే ప్రధాన లక్ష్యం దెబ్బతింటుంది. ఆ పద్ధతిలో ఎక్కువ కాలం కొనసాగడం అసాధ్యం. ఇంతకాలం ఈ స్థాయిలో ఆడటం నా అదృష్టం. జట్టు విజయం సాధించే క్రమంలో ఇలాంటి మైలురాయిని అందుకోవడం చాలా ప్రత్యేకం" అని పేర్కొన్నాడు. కాగా, కోహ్లీని ఎంతో ఆరాధించే భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఈ చారిత్రాత్మక క్షణంలో అతనితో కలిసి ఉండటంపై ఆనందం వ్యక్తం చేశాడు.

# వాయిదాపడ్డ కొరియన్ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'హోప్'- భారత్ లో కొత్త రిలీజ్ డేట్ ఇదే!

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొరియన్ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'హోప్' భారత్ లో విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ 25న థియేటర్లలోకి రావాల్సిన ఈ చిత్రాన్ని, అక్టోబర్ 23, 2026న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) నుంచి సెన్సార్ ప్రక్రియ పూర్తికావడంలో జాప్యం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం స్పష్టం చేసింది.సమాచారం ప్రకారం, ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌కు సెన్సార్ బోర్డు ఎలాంటి కట్స్ లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో డబ్ అవుతున్న వెర్షన్ల సర్టిఫికేషన్ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఈ ప్రక్రియలకు తగినంత సమయం కేటాయించేందుకే విడుదల తేదీని వాయిదా వేసినట్లు తెలుస్తోంది.'ది చేజర్', 'ది ఎల్లో సీ', 'ది వైలింగ్' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలతో అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు నా హాంగ్-జిన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఒక మారుమూల ఓడరేవు పట్టణంలో గుర్తుతెలియని వస్తువు కనుగొనబడిన తర్వాత చోటుచేసుకునే రహస్యమైన, ప్రమాదకరమైన పరిణామాల చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుంది.ఈ చిత్రంలో కొరియన్, హాలీవుడ్ పరిశ్రమలకు చెందిన భారీ తారాగణం నటించడం విశేషం. హ్వాంగ్ జంగ్-మిన్, జో ఇన్-సంగ్, జంగ్ హో-యోన్ వంటి కొరియన్ స్టార్లతో పాటు, హాలీవుడ్ నటులు మైఖేల్ ఫాస్‌బెండర్, అలిసియా వికాండర్, టేలర్ కిట్ష్ కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ చిత్రం 2026 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మే 17న ప్రదర్శితమై ప్రశంసలు అందుకుంది. అంతేకాకుండా, అమెరికాలో 7 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి, అత్యధిక వసూళ్లు సాధించిన కొరియన్ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ వారం యూకే, స్వీడన్, స్విట్జర్లాండ్‌లలో విడుదల కానుండగా, అక్టోబర్‌లో అర్జెంటీనా, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లలో రిలీజ్ అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా నవంబర్‌లో విడుదల కానుంది. ప్లస్ ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫోర్జ్ ఫిల్మ్స్, వెస్ట్‌వరల్డ్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని, భారత్‌లో స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ విడుదల చేస్తోంది. హాంగ్ క్యుంగ్-ప్యో సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కిమ్ సన్-మిన్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.




# రజనీ 'ధర్మన్'లో రామ్
## ఆ ఒక్క ఫొటోతో బయటపడ్డ అసలు విషయం!

సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' సినిమా షూటింగ్ ప్రస్తుతం మైసూర్‌లో జరుగుతోంది. ఈ సినిమా సెట్స్ నుంచి నటి రాశీ ఖన్నా కొన్ని ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఈ ఫొటోలలో రజనీకాంత్‌తో పాటు టాలీవుడ్ నటుడు రామ్ పోతినేని కూడా ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌లో ఆయన నటిస్తున్నా రన్న వార్తలకు స్పష్టత వచ్చినట్లయింది. మైసూర్‌లోని తన దినచర్య గురించి రాశీ ఖన్నా తన పోస్ట్‌లో సరదాగా రాసుకొచ్చారు. "కొంతకాలంగా నేను మైసూర్‌లో గడుపుతున్న ప్రపంచం నుంచి చిన్న గ్లింప్స్.. తెల్లవారుజామునే రజనీ సర్, రామ్‌తో కలిసి వర్కౌట్స్. కొన్ని ఆలయాల సందర్శన, కొద్దిగా తిరగడం, కాస్త ఆట, చాలా నవ్వులు. ఇక, మైసూర్ దోశకు ప్రత్యేక స్థానం ఇవ్వాల్సిందే. #dharman" అని రాశీ ఖన్నా పేర్కొన్నారు. కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. 'ధర్మన్' చిత్రంలో రజనీకాంత్ డాక్టర్ పాత్రలో కనిపించనుండగా, సిమ్రాన్ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. చెన్నైలో మూడో షెడ్యూల్ పూర్తి చేసుకున్న చిత్ర బృందం, ప్రస్తుతం మైసూర్‌లో నాలుగో షెడ్యూల్ చిత్రీకరణ జరుపుకుంటోంది. మైసూర్‌లో దాదాపు 10 రోజుల పాటు షూటింగ్ ప్లాన్ చేశారు. ఈ చిత్రాన్ని 2027 పొంగల్ (సంక్రాంతి) కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.





## సీఎం విజయ్ కొడుకు దర్శకత్వంలో సందీప్ కిషన్ 'సిగ్మా'కు సెన్సార్ పూర్తి

యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సిగ్మా' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ) ఈ చిత్రానికి U/A సర్టిఫికేట్ జారీ చేసింది. దీంతో సినిమా విడుదలకు మార్గం సుగమమైంది. తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు సి. జోసెఫ్ విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి.నిర్మాత జీకేఎం తమిళ్ కుమరన్ ఈ విషయాన్ని తన 'ఎక్స్' ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. అక్టోబర్ 2న థియేటర్లలోకి రానున్నట్లు తెలుపుతూ, U/A సర్టిఫికేట్ పొందిన కొత్త పోస్టర్‌ను ఆయన పంచుకున్నారు. ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించారు.ఇటీవల విడుదలైన ట్రైలర్ ప్రకారం.. ఇది యాక్షన్, అడ్వెంచర్, హెయిస్ట్ కామెడీ జానర్‌లో రూపొందింది. రూ. 500 కోట్ల విలువైన డ్రగ్స్, గ్యాంబ్లింగ్ రాకెట్ చుట్టూ కథ నడుస్తుంది. మోసపోయిన హీరో (సందీప్ కిషన్) తన స్నేహితులతో కలిసి ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడు అనేది కథాంశం. ఈ చిత్రంలో సందీప్ కిషన్‌కు జోడీగా ఫరియా అబ్దుల్లా నటించగా, సంపత్ రాజ్, రాజు సుందరం, శివ పండిట్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. కోస్తా ఆంధ్ర, తెలంగాణలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమాస్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాయి.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.